


బస్సు ఎక్కేందుకు బారులు

అవస్థలకు సిద్ధం కావాల్సిందేనా?

- సీఎం సభకు జిల్లా బస్సులు
- తరచూ ఆర్టీసీ ప్రయాణికులకు పాట్లు


విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

విజయనగరం(ఆంధ్రజ్యోతి)/ విజయనగరం రింగురోడ్డు, మార్చి 11: ముఖ్యమంత్రి జగన్ చేపడుతున్న సిద్ధం ఎన్నికల ప్రచార సభలకు విజయనగరం జిల్లా నుంచి నిరంతరం బస్సులను తరలిస్తున్నారు. దీంతో ఇక్కడి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గంటల కొద్దీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో నిరీక్షించడం.. ఉన్న కొద్దిబస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించడం అలవాటుగా మారింది. ఇదేంటి పరిస్థితి అని విసిగిపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ప్రచార సభలు జరిగినా జిల్లా బస్సులను వినియోగిస్తున్నారు. తాజాగా ఒంగోలు జిల్లా మేదరమెట్లలో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు విజయనగరం డిపో నుంచి 14, ఎస్.కోట డిపోనుంచి 6 బస్సులు కేటాయించారు. ఇప్పటికే డొక్కు బస్సులతో తూగుతూ...తుళ్లుతూ ప్రయాణిస్తున్న వారంతా అవి కూడా లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలోని రెండు డిపోలకు కొత్త ఆర్టీసీ బస్సులు నాలుగేళ్లుగా కొనుగోలు చేయలేదు సరికదా ఉన్న బస్సులను సైతం ఇష్టారాజ్యంగా సొంత కార్యక్రమాలకు వాడుకోవటం దారుణమంటూ సగటు ప్రయాణికుడు దుమ్మెత్తిపోస్తున్నాడు. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులు గంటల తరబడి బస్సు ల కోసం శని, ఆది, సోమవారాల్లో ఎదురుచూడడం కన్పించింది. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం-మన్యం జిల్లానుంచి 40, విశాఖ నుంచి ఏకంగా 100 బస్సులు తరలించారు. ఈ బస్సులన్నీ సోమవారం మధ్యాహ్నానికి డిపోలకు చేరుకున్నాయి. అప్పటివరకు ప్రజలకు ఇబ్బంది తప్పలేదు.

పూర్వ వైభవం కలేనా?


మూతపడిన స్టీల్ కర్మాగారం

- పారిశ్రామిక పట్టణం పేరు ఇక చరిత్రేనా?
- రాజాంలో మూతపడుతున్న కర్మాగారాలు
- నిర్వహణ భారంతో మూసివేస్తున్నవైనం
- వలస బాట పట్టిన కార్మికులు
- పారిశ్రామికవేత్తలకు అందని ప్రోత్సాహం
- వైసీపీ సర్కారు హయాంలో మరింత వెనుకబాటు

రాజాంలో
ఒకప్పుడు ఎక్కడ చూసినా యంత్రాల శబ్దాలు.. ముడి సరుకు తీసుకువచ్చే లారీలు.. బరువు తూచే కాటాలు.. చుట్టుపక్కల గ్రామాల నుంచి సిఫ్టుల వారీగా నిరంతరం వచ్చివెళ్లే కార్మికులు.. పారిశ్రామిక వేత్తల రాకపోకలు తదితర దృశ్యాలే కనిపించేవి. నేడు దాదాపు కనుమరుగైపోయాయి. వాటి స్థానంలో మూతపడిన పరిశ్రమల బోర్డులు.. తుప్పుపట్టిన యంత్రాలే మిగిలాయి. వైసీపీ వచ్చాక కొత్త పరిశ్రమ ఒకటీ రాకపోగా మూతపడిన వాటిని తెరిపించే ఆలోచన కూడా చేయలేదు. ఈ పరిస్థితిని గమనిస్తున్న సగటు రాజాం పౌరులు మళ్లీ పూర్వవైభవం వస్తుందా.. లేక కలేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాజాం రూరల్, మార్చి 11: రాజాంకు పారిశ్రామిక పట్టణంగా ఉన్న పేరు చెదురుతోంది. ఒకటి.. రెండు మినహా దాదాపు మూతపడ్డాయి. నాడు కొత్త పరిశ్రమల స్థాపనకు పోటీపడే పారిశ్రామికవేత్తలు నేడు ఆ వైపుగా ఆలోచించడానికి కూడా ఇష్టపడడం లేదు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలకు చెందిన నిష్ణాతులైన పనివారు ఈ ప్రాంతానికి వలస వచ్చి కర్మాగారాల్లో పనిచేసేవారు. నేడు స్థానికులకే ఉపాధి కరువై వలస బాట పడుతున్నారు. కొత్త పరిశ్రమలు రాకపోవడం, ఉన్నవి మూతపడడం, యాజమాన్యాలు లే-ఆఫ్, లాకౌట్ ప్రకటించడంతో వందలాది మంది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.

ఎన్నో పరిశ్రమలకు కేంద్రంగా..


రాజాంకు చెందిన గ్రంధి మల్లికార్జునరావు (జీఎంఆర్), గ్రంధి ఈశ్వరరావు ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు శ్రీకారం చుట్టారు. వారి బాటలో మరికొంతమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ఆసక్తి కనబరిచారు. జూట్, స్టీల్, ఆక్వా, జీడిపప్పు, స్పిన్నింగ్, వైర్, నట్ అండ్ బోల్ట్, ఐరన్, డైటెక్స్, కేబుల్, కండక్టర్స్, బోర్డ్స్, సిమెంట్, పాలిమర్స్, పైపులు, మినరల్ వాటర్, బిస్కట్స్, సైకిల్ రిమ్ములు, పోలిథిన్ బ్యాగ్స్, కార్డుబోర్డు షీట్స్, అల్యూమినయం తదితర పరిశ్రమలు ఏర్పటయ్యాయి. ఈ పరిశ్రమల్లో వేలాదిమంది కార్మికులు పనిచేస్తూ ఉపాధి పొందేవారు. అయితే కాలక్రమంలో ఒక్కొక్కటిగా తాళాలు పడడం ప్రారంభమయ్యాయి. దీంతో కార్మికులు పొట్ట చేత పట్టుకుని ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టారు. ప్రస్తుతం జూట్ మినహా మిగతావన్నీ మూతపడ్డాయి.

పెరుగుతున్న విద్యుత్, డీజిల్ చార్జీలు

రాజాంలో పరిశ్రమల మూతకు ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడమే. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం కొరవడింది. సేల్స్‌ట్యాక్స్‌లో రాయితీలు లేవు. విద్యుత్, డీజిల్, పెట్రోల్, రవాణా చార్జీలు భారీగా పెరిగాయి. లేబర్ ప్రధాన సమస్యగా మారింది. కార్మిక చట్టాలు, యూనియన్ల ఒత్తిడి కూడా ఎక్కువైంది. పన్నుల భారం, ప్రభు త్వం మారినపుడల్లా పారిశ్రామిక విధానాలు మారడం కూడా పరిశ్రమలు మూతకు కారణమని పలువురు పారిశ్రామిక వేత్తలు చెబుతున్నారు. పూర్తిస్థాయి అవగాహన లేకుండా కర్మాగారాలు ఏర్పాటు చేసి చేతులు కాల్చుకుని పరిశ్రమలను మూసివేసిన సందర్భాలూ లేకపోలేదు. మారుతున్న ప్రభుత్వ విధానాలను తట్టుకుని పారిశ్రామిక వేత్తలు నిలదొక్కుకోలేకపోవడం కూడా మరో కారణమని వారంటున్నారు.

కానరాని రాయితీలు

వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వాటిస్థాపనకు అయిన ఖర్చులో 20 శాతం ప్రభుత్వం పెట్టుబడి రాయితీగా ఇచ్చేది. 1985 నుంచి అమలులోకి వచ్చిన ఈ విధానాన్ని కాలక్రమంలో నిలిపివేశారు. పరిశ్రమలకు ప్రభుత్వం నుంచి మూడేళ్ల పాటు ఇచ్చిన విద్యుత్ రాయితీని కూడా ఆపేశారు. మూడేళ్లలో హీనపక్షంగా ప్రభుత్వం నుంచి ఒక్కో పరిశ్రమకు రూ.50 లక్షల వరకూ విద్యుత్ రాయితీ అందేది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అమ్మకం పన్నుపై 14 ఏళ్ల పాటు 135 శాతం రాయితీని ప్రభుత్వం కల్పించేది. 2001 నుంచి ఈ రాయితీని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం తగ్గింది. కర్మాగారాలలో సంక్షోభం నెలకొని మూతపడ్డాయి. వీటిని తెరిపించే ప్రయత్నాలను వైసీపీ ప్రభుత్వం కనీసం చేయడం లేదు. పైగా విద్యుత్‌పై రాయితీలను ఎత్తివేసి ఏకంగా యూనిట్ ధరను అమాంతం పెంచేసేంది. ప్రస్తుత యూనిట్‌కు రూ.15 పైమాటే. అటు ముడి సరుకుల లభ్యత కూడా లేదు. ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడం లేదు. కనీసం పరిశ్రమలు ఎందుకు మూతపడుతున్నయో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు.





మూతపడిన వైర్ పరిశ్రమ

ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

పరిశ్రమల ఏర్పాటుకు, పారిశ్రామిక వేత్తలు నిలదొక్కుకు నేందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ప్రధానం. అమ్మకం పన్ను, విద్యుత్, సేల్స్‌టాక్స్ తదితర అంశాల్లో రాయి తీలు ప్రకటించాలి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు తక్కువ ధరకు భూమిని కేటాయించాలి. ఇవేవీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఫలితంగా కొత్త పరిశ్రమలు రావడం లేదు.

- పొట్టా సత్యనారాయణ గుప్త, మాజీ పారిశ్రామికవేత్త

యువత వద్దకు టీడీపీ



- రాష్ట్రంలో పరిస్థితులపై అవగాహన సదస్సులు
- కొత్తగా ఓటు పొందిన విద్యార్థులతో ముఖాముఖీ

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)
యువ ఓటర్లపై టీడీపీ దృష్టి సారించింది. ఇందులో భాగంగా వివిధ కళాశాలల్లో యువ ఓటర్లు, కొత్తగా ఓటు హక్కు పొందిన వారితో సమావేశమవుతోంది. ఈ ప్రభుత్వం యువతను ఏవిధంగా నిర్వీర్యం చేసిందో వివరిస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసపోతున్న వైనాన్ని ఉదహరిస్తోంది. టీడీపీ రాష్ట్ర నాయకత్వం సూచన మేరకు యువ ఓటర్లతో జిల్లా నాయకులు ముఖాముఖీ ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే యువతకు, నిరుద్యోగులకు ఏవిధంగా మేలు చేయనుందో వివరిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పేరొందిన యువ ప్రొఫెషనల్స్, టీఎన్ఎస్ఎఫ్ నాయకుల ద్వారా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరంలోని కోచింగ్ సెంటర్లలో వందలాది మంది నిరుద్యోగులు చదువుకుంటున్నారు. వీరితో పాటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న వారిని కూడా ఒక చోటుకు చేర్చి అవగాహన కల్పిస్తున్నారు. విజయనగరంలో శని, ఆదివారాల్లో కోచింగ్ సెంటర్ల వద్ద ఉన్న నిరుద్యోగ యువతను కలిసి ఓటుపై అవగాహన కల్పించారు. ఈనెల 10న కోట జంక్షన్, శంకరమఠం, గుమ్చి జంక్షన్ ప్రాంతంలో ఉన్న కోచింగ్ సెంటర్లలో ముఖాముఖీ అయ్యారు. ఎస్.కోటలో శనివారం టీఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. బొబ్బిలిలోని వివిధ కళాశాలలు.. ఇంజినీరింగ్ విద్యార్థులతో తాజాగా సమావేశమయ్యారు. స్థానిక లోకబంధు రెసిడెన్సీలో తేజస్వి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. టీడీపీ వస్తే ఉద్యోగ అవకాశాలు ఎలా పెంపొందిస్తారు.. ఐటీ కంపెనీలు ఎలా తీసుకు వస్తారు.. ప్రభుత్వ ఉద్యోగాలు ఏ విధంగా భర్తీ చేస్తారు.. నిరుద్యోగ యువతకు ఉపాధి ఎలా చూపుతారు అనేది స్పష్టం చేశారు. నిరుద్యోగ భృతి గురించి యువ ఓటర్లు ప్రశ్నలు వేశారు. బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబీనాయన కూడా హాజరయ్యారు. గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలో సాయి సిద్ధార్థ కళాశాలలో విద్యార్థులతో సోమవారం ముఖాముఖీ జరిగింది. టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ల మొదటి జాబితాలో చోటు దక్కించుకున్న కొండపల్లి శ్రీనివాసరావు కూడా మాట్లాడారు.

జిల్లాలో కొత్త ఓటర్లు

జిల్లాలో ఈసారి కొత్త ఓటర్లు సుమారు 23,636 వరకు ఉన్నారు. ఈమధ్యే ఓటు హక్కు పొందిన వారిలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. జనవరిలో ప్రకటించిన జాబితాలో మొత్తం ఓటర్లు 15,41,001 మంది ఉండగా పురుషులు 7,60,400... స్త్రీలు 7,80,518... ఇతరులు 83 మంది ఉన్నారు. కొత్త ఓటర్లలో పురుషులు 10,344, స్త్రీలు 13,311 మంది ఉన్నారు. వేలాదిగా కొత్త ఓటర్లు ఉండటంతో టీడీపీ వారిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.


ఎస్.కోటలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో యువ ఓటర్లతో ముఖాముఖీ (ఫైల్)

గుట్టుగా బదిలీలు?

విద్యాశాఖలో అనధికారికంగా ఉపాధ్యాయుల స్థానచలనం

కలెక్టరేట్, మార్చి 11: జిల్లా విద్యాశాఖలో అనధికారికంగా ఉపాధ్యాయుల బదిలీలు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. విద్యాశాఖ మంత్రి సిఫార్సు లేఖలతో కొందరు ఉపాధ్యాయులను బదిలీ చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది. అవి మండల విద్యాశాఖ అధికారికి కూడా వెళ్లినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఎంతమంది ఉపాధ్యాయులను వారికి కావాల్సిన స్థానాలకు మార్పు చేశారనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇదే విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ కుమార్ వద్ద ప్రస్తావించగా ఈ బదిలీలతో తమకు సంబంధం లేదని, కమిషనర్ స్థాయిలో ఉంటాయని, తమకు అధికారికంగా ఎటువంటి ఆదేశాలు రాలేదని వెల్లడించారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆరా

స్వయంగా పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి/ గజపతినగరం, మార్చి 11: బొబ్బిలి నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం పరిశీలించారు. మెట్టవలస గ్రామంలో 88, 89, 90 పోలింగ్ కేంద్రాలను తొలుత సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలను కల్పించారా? లేదా? అని ఆరా తీశారు. ఫర్నీచరు, విద్యుత్, తాగునీరు, వాష్‌రూమ్ సదుపాయాలను సత్వరం కల్పించాలన్నారు. అనంతరం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల పంపిణీ కేంద్రం, పోలింగ్ ముందు, తరువాత ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్‌రూములను కలెక్టర్ పరిశీలించారు. ఆర్డీవో ఎ.సాయిశ్రీతో సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆరా తీశారు.

ఎన్నికల పరిశీలకులు బస చేసేందుకు బొబ్బిలి రైల్వే గెస్ట్‌హౌస్‌ను కేటాయించడంతో అక్కడికి వెళ్లి కూడా పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దారు వి.శ్రీనాథరావునాయుడు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు రెడ్డిసాయికృష్ణ, ఆర్ఐ కళ్యాణచక్రవర్తి తదితరులు ఉన్నారు.

- పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. సోమవారం ఉదయం గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను తొలుత పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా పూర్తి చేసేందుకు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేలోగా ఏర్పాట్లు పూర్తికావాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట విజయనగరం ఆర్డీవో ఎంవీ సూర్యకళ, తహసీల్దార్ రమేష్, డీటీ సత్యన్నారాయణ తదితరులు ఉన్నారు.


బొబ్బిలి: ఆర్డీవో కార్యాలయంలో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డీవో

నిధుల కోసం నిరీక్షణ

- వసతి గృహాలకు ఐదు నాలుగునెలలుగా అందని డైట్ బిల్లులు
- కాస్మెటిక్ చార్జీలదీ అదే పరిస్థితి
- చేతి డబ్బులు పెడుతున్న సంక్షేమ అధికారులు


బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం

కలెక్టరేట్, మార్చి 11:
జిల్లాలోని వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు భోజన నిధులు(డైట్ బిల్లులు) మంజూరు కాలేదు. అలాగే కాస్మెటిక్ చార్జీలు కూడా ఇవ్వడం లేదు. ఐదు నెలల నుంచి ఈ సమస్య ఉంది. జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. చేసేదిలేక ఆయా సంక్షేమ అధికారులు చేతి డబ్బులు పెడుతున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా నెలలుగా బిల్లుల కోసం అయా వార్డెన్లు ఎదురు చూస్తున్నారు. ఈ ప్రభావం విద్యార్థులకు అందజేస్తున్న భోజనంపై పడుతోంది. నాణ్యత తగ్గుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో 38 ప్రీమెట్రిక్, 15 కళాశాల వసతిగృహాలున్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 14 ప్రీమెట్రిక్, మరో 16 పోస్టు మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వాటిల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. భోజనంలో నాణ్యత ఉండదం లేదని, మెనూ పాటించడం లేదని పేరు చెప్పడానికి ఇష్టపడని కొందరు విద్యార్థులు వాపోయారు. బిల్లులు చెల్లించకుంటే ఎలా అని వార్డెన్లు గోడు వెళ్లబోసుకుంటున్నారు. ఐదు నెలల నుంచి డైట్ బిల్లులు అందక పోవడంతో సంక్షేమ అధికారులు చేతి పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కొంతమంది అప్పులు చేశారు. ఇదిలా ఉంటే విద్యార్థులకు అందజేయనున్న కాస్మోటిక్ చార్జీల నిధులు నాలుగు నెలలు నుంచి విడుదల కాలేదు. ఇదే విషయమై ఏబీసీడబ్ల్యూవో యశోధనరావు వద్ద ప్రస్తావించగా డైట్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీల బిల్లులు రెండు మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నివేదిక అడిగాక వివరాలు నివేదించామని చెప్పారు.



బంగారు భవితకు ఓటే వజ్రాయుధం

● కొత్త ఓటర్లతో బేబీనాయన ముఖాముఖి

● యువత ప్రశ్నలకు సావధానంగా సమాధానమిచ్చిన నేత

బొబ్బిలి, మార్చి 11: తెలుగు యంగ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లోకబంధు రెసిడెన్సీలో కొత్తఓటర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) మాట్లాడుతూ రాష్ట్ర బంగారు భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ వజ్రాయుధం, బ్రహ్మాస్త్రంలాంటి ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తప్పుడు పద్ధతుల్లో పాలన సాగించే నాయకులకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ధరలు ఆకాశాన్ని తాకాయనని, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారన్నారు. యువత జాగృతం అయితే అవినీతి రహిత సమాజం రావడంఖాయమని, రాష్ట్రానికి మేలు జరగాలన్న దృక్పథంతో ఓటును వినియోగించుకోవాలని బేబీనాయన హితవు పలికారు. ● నేటి సమాజంలో ఎంతో మంది సొంతగడ్డను, జన్మభూమిని వీడి ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడుతున్నారని, బొబ్బిలి రాజవంశీయుడైన బేబీనాయన సొంతగడ్డకు సేవలందించాలన్న సదుద్దేశంతో చెన్నై నుంచి వచ్చి నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నారని రాష్ట్ర ప్రొఫెషనల్స్ సంఘం అధ్యక్షురాలు పొడపాటి తేజస్వి అన్నారు. గ్రామ గ్రామాన బేబీనాయన అందించిన సేవలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని, సొంత సొమ్ముతో అన్న క్యాంటీన్ కూడా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ● ఈ సందర్భంగా యువఓటర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో బేబీనాయన వారందరికీ సమర్థంగా సమాధానాలు చెప్పి ఆకట్టుకున్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతాం.. ఆరోగ్యానికి హేతువుగా మారిన మద్యాన్ని పారదోలి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాం.. బొబ్బిలి పట్టణంలో అత్యాధునిక వసతులతో లైబ్రరీకి హంగులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాడైన రోడ్లకు టీడీపీ-జనసేన ప్రభుత్వ హయాంలో మహర్దశ వస్తుందని.. ఇలా యూత్ అడిగిన ప్రతి అంశానికి బేబీనాయన సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఎ.సతీష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. పెద్దసంఖ్యలో కొత్త ఓటర్లు, టీడీపీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బేబీనాయన

మార్పు రావాలంటే సైకో పోవాలి

● కోండ్రు మురళీ మోహన్

రాజాం: రాష్ట్రంలో మార్పు కావాలంటే సైకో పాలన పోవాలని కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన పాండ్రంకి భుజంగరావు, నవిరి శంకరరావు, నవిరి రాము, పాండ్రింకి నర్సింహమూర్తి, గవిడి అప్పలనాయుడు, ఉప్పు రాములు, నల్లబారిక బాలకృష్ణ, తదితర 34 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు వంచనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లచ్చుభుక్త కృష్ణమూర్తి, తుమ్మి రాజగోపాలనాయుడు, మజ్జి వెంకటనాయుడు పాల్గొన్నారు. ● ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పాలని కోండ్రు మురళీమోహన్ పిలుపుని చ్చారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని మల్లిఖార్జున కాలనీ, మెహర్ బాబా కాలనీలో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఎక్కడ ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయో సర్వేచేయించి ఆక్రమ ణలకు పాల్పడ్డారని బవిమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, పొట్టా చిట్టిబాబు, బనిశెట్టి వెంకటరావు, వంజరాపు రాము, ఆశపు సత్యనారాయణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, ఆటో కోటి, కె.రవి, ఉరిటి సురేంద్ర పాల్గొన్నారు. ● రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సూచించారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మారెడుబాక, నందబలగ గ్రామాల పార్టీ నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న భూ ఆక్రమణలు, ఇసుక దందాలు, అవినీతి, అక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాష్‌రావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, శాసపు రాజేష్‌కుమార్, వంగా వెంకటరావు, జరజాన నీలయ్య, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కోండ్రు

ఉంగరాడలో కోండ్రు ప్రచారం

రేగిడి: మండలంలోని ఉంగరాడలో సోమవారం రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిక్స్‌గ్యారెంటీ పథకాలు, జగన్ అరాచకపాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌బాబు, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, గురవాన ధనంజయ్, కర్ణేన మహేష్, ఉంగరాడ సర్పంచ్ చల్ల భుజంగరావు పాల్గొన్నారు.

సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోండి

తెర్లాం: వయసు పైబడిన ప్రతి ఒక్కరూ రెండు సంవత్సరాలకు ఒకసారి నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి నుంచి దృష్టిని కాపాడుకోవచ్చునని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మనోజ్ఞ అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరుమాళి ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ గ్లకోమా అనేది కుటుంబ చరిత్ర కలవారికి, చక్కెర వ్యాధి కలవారికి, గాయాలు బారినపడిన వారికి, వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. 55మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి వారిలో 22 మందికి కంటి శస్త్ర చికిత్సల కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి పుష్పలత, పర్యవేక్షకులు భవానీ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు చేయించాలి

రామభద్రపురం: గర్భిణులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులి దిలీప్‌కుమార్ సూచించారు. సోమవారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయిస్తే తల్లీపిల్లలకు ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 16న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయికల్యాణ్‌చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138, ఎన్ఐ యాక్ట్, ఎక్సైజ్ కేసులు, మోటారు ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుల కేసులు, భూ సేకరణ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఫూల్‌బాగ్ కాలనీ, హనుమాన్ నగర్‌లో ఎంఆర్ పీజీ కళాశాల హాస్టల్ భవన ప్రాంగణంలో ఆరోజు ఉదయం 10 గంటలకు లోక్‌అదాలత్ ప్రారంభమవుతుందని న్యాయాధికారి తెలిపారు.

హోం ఓటింగ్‌పై అవగాహన

లక్కవరపుకోట(కొత్తవలస): భారత ఎన్నికల కమిషన్ నూతనంగా చేపట్టబోతున్న హోం ఓటింగ్ కార్యక్రమంపై సోమవారం కొత్తవలసలో అవగాహన కల్పించారు. అంగవైకల్యం 40 శాతం దాటి ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు తమ ఇంటి వద్ద నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని చైతన్య మానసిక వికలాంగుల పాఠశాల చైర్మన్ బోజంకి సన్యాసిరావు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి 5 రోజుల్లో ఫారం -12డీని పూర్తి చేసి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలన్నారు. ఒక టీం వచ్చి బ్యాలెట్‌ను తీసుకుంటారని తెలిపారు. బ్యాలెట్‌ను ఏ విధంగా ఉపయోగించాలో చెప్పడానికి ఎన్నికల సిబ్బంది వస్తారన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కలెక్టరేట్: జిల్లాలోని 26 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 7 నుంచి 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు లక్ష్యాలు చేరుకోవాలి

రేగిడి: ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్ధేశించిన లక్ష్యాలు చేరుకోవాలని ఎంఈవో-1, 2లు వరప్రసాదరావు, బి.ఏరకయ్యలు పేర్కొన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

రామభద్రపురం: ఈ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన క్రాష్ ప్రోగ్రాంకు సంబంధించి మెటీరియల్ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వెంటనే బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీ బెవర ప్రసాద్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆశీలు వేలంపాట మళ్లీ వాయిదా

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని ఆశీలు వేలం పాట ఏడోసారి కూడా వాయిదా పడింది. సోమవారం కమిషనర్ నారప్పలనాయుడు ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయంలో వేలంపాట నిర్వ హించారు. కాంట్రాక్టర్లు పాట పాడటానికి ముందుకు రాకపోవడంతో వాయిదావేశారు. గత ఏడాది రూ.38 లక్ష లకు పాట పాడిన విషయం విదితమే. అంతమొత్తం నిధులు వసూలు కాకపోవడంతో ఈ ఏడాది పాటను పాడేందుకు ఏ ఒక్క కాంట్రాక్టర్‌రూ ముందుకు రాలేదు. అయితే పాటలో పాల్గొనేందుకు పదిమంది వరకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినా, అధికారులు నిర్ణయించి పాటకంటే తక్కువగా వస్తే పాటకు ముందుకొస్తామన్నారు.

కొత్త ఓటర్లంతా టీడీపీకి ఓటేయండి

విజయనగరం రూరల్: 'కొత్త ఓటర్లారా.. టీడీపీకి ఓటేయండంటూ' తెలుగు యువత, తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్)లు పిలుపునిచ్చాయి. 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా ఆయా విభాగాల నాయకులు నగరంలోని ట్యూషన్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు, ప్రైవేటు కళాశాలల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పొగిరి పైడిరాజు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ అన్న హామీని జగన్ విస్మరించారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేవన్నారు. విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత-టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాతా బుజ్జి, మజ్జి పైడిరాజు, బండారు రాజేష్, పీకేఎల్ రాజు, పొట్నూరు గోవింద్, పెనుమత్స మణికంఠ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

డ్వాక్రా సంఘాల ఘనత టీడీపీదే

విజయనగరం రూరల్: మహిళా సాధికారితే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిందని ఆ పార్టీ మహిళా విభాగం నేతలు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగంలు చెప్పారు. సోమవారం నగరంలోని 3, 4 డివిజన్ల పరిధిలో ఉన్న డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో పాటు, మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించారని తెలిపారు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు టీడీపీ కృషి చేసిందన్నారు. 'కలలకు రెక్కలు' పథకంతో ఎంతో ప్రయోజనం కలగనుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా విభాగం నాయకులు రౌతు పద్మ, మురిపేన పద్మలత, వీరలక్ష్మి, ఝాన్సీ, టీడీపీ నాయకుడు గంట్రేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం గజపతినగరంలోని జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ స్వగృహంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. పడాల అరుణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచనల మేరకు తమ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పడాల శరత్, మండల అధ్యక్షుడు మునకాల జగన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

తల్లిదండ్రులను హింసిస్తే కఠిన చర్యలు

● అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ ● ఎస్పీ 'స్పందన'కు 22 ఫిర్యాదులు

విజయనగరం క్రైం: తల్లిదండ్రులను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్ ఆదేశించారు. సోమవారం 'స్పందన' కార్యక్రమంలో 22 ఫిర్యాదులు స్వీకరించారు. ● విజయనగరం మండలం చెల్లూరుకు చెందిన మహిళ అదనపు ఎస్పీ ఆస్మాపరహీన్‌కు ఫిర్యాదు చేస్తూ తన భర్త మరణానంతరం తన కుమారులు ఆస్తులు పంచుకొని తన బాగోగులు సక్రమంగా చూడడం లేదని.. న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆమె విచారణ చేపట్టి ఫిర్యాదీకి న్యాయం చేయాలని విజయనగరం రూరల్ సీఐని ఆదేశించారు. ● జ్యూట్‌మిల్లుకు చెందిన స్థలంలో కొంత మంది వ్యక్తులు అక్రమంగా శ్మశానం నిర్మిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లిమర్ల జ్యూట్ ప్రతినిధి కోరారు. ● తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటుండగా.. తమ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి తనను కొట్టారని, న్యాయం చేయాలని గుర్ల మండలం వల్లాపురానికి చెందిన వ్యక్తి కోరారు. ఈ మేరకు ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ స్పందిస్తూ విచారణ చేపట్టి తీసుకున్న చర్యలను తక్షణమే నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వీరకుమార్, సీఐ మురళి, ఎస్ఐలు ప్రభావతి, గణేష్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ ఆస్మాపరహీన్

ఇళ్ల పట్టాలు ఇచ్చేదెపుడు?

● కొండకెంగువ గ్రామస్థుల ఆందోళన

రామభద్రపురం: కొండకెంగువ గ్రామానికి చెందిన అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ ఆకుల సులోచనారాణిని స్థానికులు నిలదీశారు. 2021లోనే అర్హులకు ఇళ్ల పట్టాలకు మంజూరుకు ఏర్పాట్లు చేశారని...కానీ లబ్ధిదారులకు ఇవ్వడానికి మాత్రం ఏ తహసీల్దార్ కూడా ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక టీడీపీ నాయకుడు మధు తెలిపారు. ఇక్కడి సర్పంచ్ తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడంతో అధికార వైసీపీ నాయకులు అడ్డు తగులుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. దీనిపై మండల వైసీపీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు స్పందిస్తూ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి 2 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంగళవారంలోగా ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొండకెంగువ గ్రామస్థులు

16తో ముగియనున్న షుగర్స్ క్రషింగ్

● సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగార అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ చెక్కర కర్మాగారం ఈ ఏడాది క్రషింగ్‌సీజన్ ఈనెల 16తో ముగిస్తున్నట్లు కర్మాగార అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వి. పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు ఈ విషయం గమనించి సకాలంలో ఉండిపోయిన చెరకును కర్మాగారానికి తరలించాలని కోరారు. సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగారంలో సోమవారం కర్మాగార యాజమాన్యప్రతినిధులు ఏబీపీతో పాటు డీజీఎం కేన్ రాజేంద్రన్, హెచ్ఆర్ మేనేజర్ వి.మురళీకృష్ణ, ఫైనాన్స్ మేనేజర్ శ్యామ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈఏడాది చెరకు గానుగ లక్ష్యం 3.87 లక్షల మెట్రిక్‌టన్నుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3.72 లక్షల మెట్రిక్‌టన్నుల గానుగ పూర్తిచేసినట్లు తెలిపారు. మరో 16వేల మెట్రిక్‌టన్నులు గానుగ ఆటకు ఉండగా, ఈనెల 16లోపు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది 18 వేల ఎకరాల్లో చెరకు సాగుకు లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకు రైతులకు పలురాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ఈఏడాది సరాసరి రికవరీశాతం 9.24కాగా, గత ఏడాదికంటే ఈఏడాది ముందు క్రషింగ్‌సీజన్ ప్రారంభించడం కొంత రికవరీ తగ్గినట్లు తెలిపారు. కర్మాగారాన్ని కాలుష్యరహితంగా నడిపేం దుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల శేయస్సు దృష్ట్యా సుగర్స్ అనుబంధ పరిశ్రమలు అన్ని జీరోబెస్డ్ పొల్యూషన్‌తో నడిపేందకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న యాజమాన్య ప్రతినిధులు

మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువ

శృంగవరపుకోట, మార్చి 11: మహిళలకు ఒర్పు, సహనం ఎక్కువని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు అన్నారు. సోమవారం శృంగవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. పోషకాహార అవస్యతకతను వివరించారు. సీడీపీవో ఉమ, ఈవోపీఆర్డీ ఐ.వి. లక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి తదితరులు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.



ఎస్.కోట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ప్రతిజ్ఞ

మురళీకృష్ణ మృతికి సీఎం బాధ్యత వహించాలి

● ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

రాజాం రూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్లలో వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో తొక్కిసలాటలో చనిపోయిన పారిశుధ్యకార్మికుడు మురళీకృష్ణ మృతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైతికబాధ్యత వహించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు ఎ.జగన్మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్‌చేశారు. సోమవారం రాజాం మునిసి పల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతి చెందిన ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మురళీకృష్ణ కుటుంబానికి రూ.కోటి నష్టపరి హారంగా ప్రకటించాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కాఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబాన్ని ఆదుకోకపోతే మునిసిపల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, లక్ష్మి, గురువులు, శంకర్రావు, రాజేష్, బాలరాజు, చినబాబు, రవి, రఘు పాల్గొన్నారు.



మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రశాంత జాతర నిర్వహణకు సహకరించాలి

● పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈవో మాధవరావు

రాజాం రూరల్: రాజాంలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిం చనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 98వ వార్షిక జాతర మహోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు ప్రతిఒక్కరూ సహకరించాలని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు కోరారు. సోమవారం రాజాంలోని దేవస్థానం ప్రాంగణంలో పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఫైర్ తదితర శాఖల అధికారులు, ఎస్వీఆర్ కళాపరిషత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకునేలా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు వీలుగా సిబ్బందిని నియమిస్తామని, పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని మునిసిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ హరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అగ్నిమాపకశాఖ అధికారి జనార్ధనరావు, ఆలయ ధర్మకర్త దుర్గాప్రసాద్, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, పొగిరి సురేష్ బాబు, మక్క అప్పలనాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, వాకచర్ల రాజా, పైడిరాజు, గ్రంధి గోపి, చైతన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాధవరావు

వాహనాలు తనిఖీ

రామభద్రపురం: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఎస్ఐ జ్ఞానప్రసాద్ ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల ముందు భాగంలో ప్రయాణికులను కూర్చోనివ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం లైసెన్సు, హెల్మెట్‌లేని వాహనదారులకు జరిమానా విధించారు.

పది పరీక్షలు ఎంతో కీలకం

జామి, మార్చి 11: ప్రతి విద్యార్థికీ పదిపరీక్షలు ఎంతో కీలకమని, తమ ఉన్నత చదువులకు ఇది తొలిమెట్టు అని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని అలమండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు.



పరీక్ష సామగ్రి అందిస్తున్న గొంప కృష్ణ

రైల్వేట్రాక్ పునరుద్ధరణ

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస రైల్వే జంక్షన్‌కు ఆనుకొని ఉన్న విశాఖ-రాయగడ రైల్వేలైను ట్రాకు పునరుద్ధరణ పనులు సోమవారం శరవేగంగా చేపట్టారు. విశాఖపట్టణం నుంచి వందల సంఖ్యలో రైల్వే కార్మికులు, ఇంజనీరింగ్ అధికారులు హాజరై ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆదివారం రాత్రి విశాఖ-భవానిపట్నం పాసింజర్ పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. కొత్తవలస స్టేషన్ నుంచి బయలుదేరిన నిమిషాల్లో ప్రమాదం జరగడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు ఏమీ జరగలేదు. కొత్తవలస-అలమండ మధ్యలో గల లైన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ట్రాక్ పునరుద్ధరణ పనులు చేస్తున్న దృశ్యం

బాలాజీ దేవస్థానం ఉద్యోగి ఆత్మహత్య

రాజాం రూరల్: బాలాజీ దేవస్థానం ఉద్యోగిగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన బ్రజ్ బిహారీ త్రిపాఠి (39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'నేనో చెడుమార్గంలోకి వెళ్లాను. అందులోనుంచి తిరిగి బయటకు రాలేని పరిస్థితి. అందుకే నేనీ తప్పుడు నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు ఎదుర్కొంటానని నేను చెడుమార్గంలోకి దిగకముందు తెలుసుకోలేకపోయాను. అందుకే చావు తప్ప వేరొక మార్గం నాకు దొరకలేదు. నా కుటుంబానికి నేను అన్యాయం చేశాను. నేను చనిపోయాక నా బాడీని నా కుటుంబానికి చేరవేయండి' అని ఈనెల 10న తన డైరీలో మరాఠీలో సూసైడ్‌నోట్ రాసుకుని సోమవారం ఉదయం తాను నివశిస్తున్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజాం ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. మండలంలోని అంతకాపల్లి సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బాలాజీ దేవస్థానంలో వంటమనిషిగా పనిచేస్తున్న బ్రజ్ బిహారీ త్రిపాఠి (39) సోమవారం గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన త్రిపాఠి బాలాజీ దేవాలయంలో 2018 నుంచి స్వామివారికి ప్రసాదం, భోగం తయారీచేసే వృత్తిలో కొనసాగుతున్నాడు. సోమవారం ఉదయం 9.30 గంటలకు క్వార్టర్స్‌కు వెళ్లిన త్రిపాఠీ 11 గంటలకు స్వామివారికి భోగం నివేదించేందుకు తీసుకురావాల్సి ఉంది. సమయం గడుస్తున్నా ప్రసాదం తీసుకు రాకపోవ డంతో ఆలయ ప్రధాన అర్చకుడు బూరుగడ్డ కాండాలి వెంకట రామానుజాచార్యులు త్రిపాఠి గది వద్దకు వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆలయ అధికారులతో పాటు రాజాం పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడు త్రిపాఠికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామానుజాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

● అయిదుగురికి తీవ్ర గాయాలు

లక్కవరపుకోట(కొత్తవలస): మండల కేంద్రమైన కొత్తవలసలో విజయనగరం- కొత్తవలస రోడ్డు మార్గంలో పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద ఆగి ఉన్న కారును లారీ ఢీకొన్న సంఘటనలో అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సీతంపేటకు చెందిన ఇద్దరు, కాంప్లెక్స్ వద్ద ఒకరు, దేశపాత్రునిపాలెంకు చెందిన మరొకరు అనారోగ్య రీత్యా ఆసుపత్రికి వెళ్లేందుకు కారులో సిద్ధమయ్యారు. వీరంతా కారులో పీఎంఎల్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. ఇంతలో విజయనగరం వైపు నుంచి వస్తున్న లారీ ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అయిదుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో మోపాడ లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గాయపడిన వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజాంలో ఏసీ మరమ్మతుల షాపు దగ్ధం

రాజాం రూరల్: రాజాంలోని ఎన్టీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ఏసీ మరమ్మతుల షాపు దగ్ధమైంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. యజమాని గణేష్ సోమవారం ఉదయం షాపు తెరిచి విద్యుత్ మీటర్ ఆన్‌చేసి షాపు షట్టర్ సగం దించి టిఫిన్ కోసం బయటకు వెళ్లాడు. ఇంతలో ఉన్నపలంగా మంటలు చెలరేగాయి. ఏసీలు, ఫ్రిజ్‌ల్లో గ్యాస్, ప్లాస్టిక్‌తో కూడుకుని ఉన్న పరికరాలు ఉండడంతో క్షణాల్లో బూడిదయ్యాయి. షట్టర్ సగం దించి ఉండడంతో అగ్నిప్రమాదం సంభవించిందన్న విషయాన్ని సమీప షాపుల యజమానులు గుర్తించలేకపోయారు. బయట నుంచి వచ్చిన షాపు యజమాని షట్టర్ తెరిచే ప్రయత్నం చేసేసరికే దాదాపుగా పరికరాలన్నీ మాడిపోయాయి. దీంతో పలువురు ఖాతాదారులకు చెందిన పలు ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు ఇతరత్రా ఎలక్ట్రికల్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు రాజాం పోలీసులకు గణేష్ ఫిర్యాదు చేశాడు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి(బాడంగి): అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. బాడంగి మద్యం దుకాణం నుంచి వంద మద్యం సీసాలను తరలిస్తున్న నందబలగ గ్రామానికి చెందిన గోపీని పాల్తేరు గ్రామ సమీపంలో పట్టుకున్నామని తెలిపారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ దాడిలో ఏఎస్ఐ కొండలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని జాడపేట గ్రామనికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఉంగరాడ మెట్ట సెంటర్‌లో సోమవారం పోలీసులు 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు బెల్ట్‌షాపు నిర్వహణకు తీసుకువెళ్తున్న మద్యాన్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంట్యాడ, మార్చి 11: మండలంలోని నరవ గ్రామానికి చెందిన పతివాడ నారాయణరావు(48) ఆదివారం రాత్రి నీలావతి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనికి సంబంధించి ఎస్ఐ సురేంద్రనాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నారాయణరావు, నీలావతి గ్రామంలోని జరిగిన గ్రామ దేవత జాతరకు వెళ్లి దిచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొండపల్లి మండలం కొత్తూరు చెందిన ద్విచక్ర వాహనాన్ని వేగంగా నీలావతి కూడలి వద్ద ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా, నారాయణరావు తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు వినతి

విజయనగరం: ప్రభుత్వం ప్రకటించిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. సోమవారం జేసీ కార్తిక్, డీఆర్వో అనితకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రెండో విడతలో కూడా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని మండల, జిల్లా స్థాయిలో జాబితా సిద్ధం చేసి స్థలాలు గుర్తించాలని కోరారు. త్వరలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న కారణంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

● జిల్లా వ్యాప్తంగా సీపీఎం నాయకుల ఆందోళన

బొబ్బిలి: ఎన్నికల బాండ్ల వ్యవహారం రాజ్యాంగ విరుద్ధమని, వాటి వివరాలను బహిర్గతం చేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్టేట్‌బ్యాంకు మెయిన్ బ్రాంచి ముందు సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 13 నాటికి ఎన్నికల సంఘం ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని కోర్టు ఆదేశించినా ఇంతవరకూ వాటిని ప్రకటించకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. గోపాల్, సురేష్, మణికుమార్, అప్పారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● **విజయనగరం:** దేశంలో పెట్టుబడిదారుల నుంచి వేల కోట్లు బాండ్ల రూపంలో బీజేపీ తీసుకుని.. వచ్చే ఎన్నికల్లో ప్రజలకు పంపిణీ చేసే కుట్ర చేస్తోందని.. తక్షణమే స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కోట జంక్షన్ సమీపంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం నేతలు రమణ, యూఎస్ రవికుమార్, త్రినాథ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు. ● **రాజాం రూరల్:** సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను తాత్సారం చేయకుండా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తక్షణమే ప్రకటించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి శంకరరావు డిమాండ్ చేశారు. దోలపేటలోని ఎస్‌బీఐ మెయిన్‌బ్రాంచ్ ఎదుట సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు, శంకరరావు మాట్లాడుతూ ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం అని ప్రకటించిన సుప్రీంకోర్టు ఆ బాండ్ల వివరాలను ఎన్నికల సంఘానికి నివేదించాలని ఆదేశించింది. గడువు ముగుస్తున్నా ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ ప్రకటించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ● **గజపతినగరం:** ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణమే వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు జి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలనకు కంకణం కట్టుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైడిపి నాయుడు, హరి కృష్ణవేణి, కోటి, కృష్ణ శంకరరావు పాల్గొన్నారు.



బొబ్బిలి: ఎస్‌బీఐ ముందు ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



విజయనగరంలో..



రాజాంరూరల్: దోలపేటలో..



గజపతినగరంలో..

మద్యపాన నిషేధం ఏదీ?

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున


సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న నాగార్జున

గరివిడి: మద్యపాన నిషేధం విషయంలో జగన్ ప్రజలను మోసం చేశారని టీడీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. బీజీ పాలెం గ్రామంలో ఆయన సోమవారం పర్యటించి, ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మద్యపాన నిషేధం చేస్తారని, మహిళలు ఓట్లు వేశారని, అయితే ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ హామీని ఆయన తుంగలో తొక్కారని విమర్శించారు. అత్యధిక రేట్లుకు మద్యం అమ్ముతూ సామాన్యుల రక్తం పీలుస్తున్నారన్నారు. అలాగే విద్యుత్ చార్జీలు పెంచి రాష్ట్ర ప్రజానికాన్ని తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పైల బలరాం, సారిపాక సురేష్‌బాబు, ముల్లు రమణ, కొండ్రు లక్ష్మణరావు, లెంక త్రినాథరావు, పిళ్లా అప్పారావు, పూర్తి రమేష్, మహంతి సూర్యారావు, వెంకన్న, బోర భాస్కరరావు, దిండి రమేష్, కోరాడ శ్రీను, సబ్బి సింహాచలం, యలమంచిలి బాలకృష్ణ, కడుపుట్ల ఏసు తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపు ఖాయం

● మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు


మాట్లాడుతున్న బాబూరావు

చీపురుపల్లి: వైసీపీ ఎన్ని బీరాలు పలికినా, రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి విజయం సాధించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రజలను రక్షించడం కోసం మూడు పార్టీల కలయిక అవసరమన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదని మొదటి నుంచి చెబుతూ వస్తున్న పవన్ కల్యాణ్ మాటలు నేటికి కార్యరూపం దాల్చుతున్నాయని గద్దే అన్నారు. కూటమిని ఏర్పాటు చేయడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారన్నారు.

జాతరను విజయవంతం చేయండి

చీపురుపల్లి: అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సోమవారం జరిగిన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 17, 18, 19 తేదీల్లో జరిగే అమ్మవారి జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆలయ పరిసరాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో బి.శాంతి, తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, సీఐ షణ్ముఖ రావు, ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు, ఏఈ త్రినాథరావు, ఈవోపీఆర్డీ అన్నపూర్ణాదేవి, ఈవో ఝాన్సీ, శానిటరీ తనిఖీ అధికారి వేణుగోపాల్, దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.3.79లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారికి గత మూడు నెలల్లో హుండీ ద్వారా రూ.3,79,304 ఆదాయం లభించింది. ఈ మేరకు సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో హుండీలు లెక్కించారు. 2023 డిసెంబరు 14 నుంచి 2024 మార్చి 11 వరకూ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా, ఈ ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చెర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు వెంకటకుమార్, దేవస్థానం ఈవో కె.పద్మావతి, ఈవో శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రామతీర్థం శివరాత్రి జాతర ఆదాయం రూ.50.11లక్షలు

నెల్లిమర్ల: రామతీర్థం రామస్వామి దేవస్థానం వద్ద గత రెండు రోజుల పాటు జరిగిన శివరాత్రి జాతరకు సంబంధించి హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జాతర ఆదాయం మొత్తం 50లక్షల 11 వేల 646 రూపాయలు వచ్చినట్లు దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు చెప్పారు. వీటితో పాటు 20 గ్రాముల 480 మిల్లీ గ్రాముల బంగారం, 7కిలోల 635 గ్రాముల వెండి ఆదాయంగా లభించినట్లు ఆయన తెలిపారు.

స్వర్గధామం అభివృద్ధికి సహకరిస్తాం

నెల్లిమర్ల: నెల్లిమర్లలోని చంపావతి నది సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్వర్గధామం అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు అన్నారు. నగర పంచాయతీ కోఆప్షన్ మెంబర్ చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటైన స్వర్గధామాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ సోమవారం ప్రారంభించారు. స్వర్గధామం అభివృద్ధికి తన సహకారం అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు ఈసందర్భంగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో చిక్కాల సాంబశివరావు, చిక్కాల అరుణకుమారి, జడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, నగర పంచాయతీ చైర్‌పర్సన్ సరోజిని, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవించడం అందరి బాధ్యత

గుర్ల: స్త్రీలను గౌరవించడం అందరి బాధ్యత అని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శాంతకుమారి అన్నారు. సోమవారం గుర్ల ఎంపీడీవో కార్యాలయంలో గరివిడి ప్రాజెక్టు పరిధిలో మహిళా దినోత్సవంతో పాటు పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ముగ్గుల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గరివిడి, గుర్ల ఎంపీపీలు పొట్నూరు ప్రమీల, మీసాల విజయలక్ష్మిలను, మహిళా సర్పంచ్‌లను, ఎంపీటీసీ సభ్యులను, ఐసీడీఎస్ అధికారులను, రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్న మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో మహిళా దినోత్సవం

నెల్లిమర్ల: మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా ముందుకు దూసుకుపోతున్నారని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వీసీ ప్రశాంత్‌కుమార్ మహంతి అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ పి.పల్లవి, పుష్పలతల చేతులమీదుగా పలువురు మహిళలకు సత్కరించారు. డీన్‌లు పీఎస్‌వీ రమణారావు, ఎంఎల్ఎన్ ఆచార్యులు, సన్నిడియోల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించండి

భోగాపురం: మహిళలంతా స్వయం ఉపాధి ద్వారా లక్షాధికారులు కావాలని ఎంపీడీవో జి.చంద్రకళ అన్నారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య సమావేశ మందిరంలో లక్‌పతి దీదీ కార్యక్రమం నిర్వహించి, మాట్లాడారు. మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది, స్వయంగా వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్దేశమన్నారు. అనంతరం స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక పురోగతి సాధించిన మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఏపీఎం రమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


కవాతు చేస్తున్న పోలీసులు

భోగాపురం: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా అతి సమస్యాత్మక సమస్యాత్మక గ్రామాల్లో సీఐ ఎ.రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం కవాతు నిర్వహించారు. పోలిపల్లి, ముంజేరు, చేపలకంచేరు, ముక్కాం గ్రామాల్లో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్సుతో ప్రజలకు హెచ్చరికలు జారీ చేసేవిధంగా కవాతు నిర్వహించారు. సాధారణ ఎన్నికల్లో ఎటువంటి ఘటనలకు పాల్పడినా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

జనసేనలో చేరిక

నెల్లిమర్ల: కొండవెలగాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గదల అచ్చెంనాయుడు జనసేన పార్టీలో చేరారు. జనసేన-టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి సోమవారం సాయంత్రం కొండవెలగాడలో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా జనసేనలో చేరిన అచ్చెంనాయుడుకు ఆమె కండువా వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

కూటమిగా ఏర్పడడం శుభ పరిణామం


మాట్లాడుతున్న బుచ్చిబాబు

విజయనగరం రింగురోడ్డు: టీడీపీ, బీజేపీ, జనసేన మూడు పార్టీలు కలిపి ఒక కూటమిగా ఏర్పడడం శుభ పరిణామమని బ్రాహ్మణ సమన్వయ కమిటీ సభ్యుడు జంధ్యాల బుచ్చిబాబు, రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు భోగాపురపు వాయు నందనశర్మ అన్నారు. సోమవారం ఓం మందిరం వద్ద గల రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన సంస్థ (తెలుగుదేశం అనుబంధ విభాగం) ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ త్వరలో జరగనున్న శాసనసభ, లోకసభ ఎన్నికల్లో ఈ కూటమిని భారీ మెజా ర్టీతో గెలిపించాలన్నారు. ఈ కూటమితో రాష్ట్రానికి తిరిగి పూర్వవైభవం వస్తుంద న్నారు. అమరావతి, పోలవరం లాంటి ప్రాజెక్టులు ముందుకు పరుగులు తీస్తాయ న్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు పేరి రామయ్య పంతులు తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

నెల్లిమర్ల: బాపట్ల జిల్లాలో ఆదివారం జరిగిన సీఎం సిద్ధం సభలో పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకుడు హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మురళీకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు పరిహారంగా అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాము, శంకర్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

● అధికార పార్టీ కౌన్సిలర్ల ఫిర్యాదు


డీఆర్వో అనితకు వినతి పత్రం అందిస్తున్న అధికార పార్టీ కౌన్సిలర్లు

దాసన్నపేట: నెలిమర్ల నగర పంచాయతీ పరిధి మిమ్స్ వైద్య కళాశాల సమీపంలో పాలకొండ ప్రధాన రోడ్డులో విలువైన స్థలంలో శాశ్వత అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు వైసీపీ నగర పంచాయతీ కౌన్సిలర్లు డీఆర్వో అనితకు ఫిర్యాదు చేశారు. సోమవారం డీఆర్వోను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈసంద ర్భంగా రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైసీపీ నాయకుడు జానా ప్రసాద్, కౌన్సిలర్లు షైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాసరావు, పైల భారతి, పాండురంగ సత్యవతి మాట్లాడుతూ ప్రధాన రహదారిలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణా లు చేపడుతున్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవటం లేదన్నారు. అధికార పార్టీ నాయకుల ప్రమేయం లేనిదే ఈ నిర్మాణాలు జరగవని ఆరోపించారు. తక్షణమే నిర్మాణాలను అడ్డుకుని వాటిని తొలగించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి


అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

నెల్లిమర్ల: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని నగర పంచాయతీలో తాగునీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్లు నల్లి శ్రీను, లెంక అప్పలనాయుడు, షైపాడ ప్రసాద్ తదితరులు తాగునీటి సమస్యలపై చర్చ లేవనెత్తారు. వేసవి తీవ్రత దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకోకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ పి.బాలాజీప్రసాద్ చర్యలు చేపట్టేందుకు సానుకూలత తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేయూత అందేనా?

● నెల రోజులు దాటినా జమకాని ఆసరా డబ్బులు


భోజనాల వద్ద తోపులాట జరుగుతున్న దృశ్యం

మెంటాడ: మండలంలో 'ఆసరా' సభపెట్టి నెలరోజులు దాటింది. లబ్ధిదారుల్లో ఒక్కరికీ సొమ్ము జమకాలేదు. నేటికీ బ్యాంకులు, వెలుగు సిబ్బంది చుట్టూ పేదలు ప్రదక్షణాలు చేస్తున్నారు. అయినా పట్టించుకొనే దిక్కులేదు. తాజాగా సోమవారం 'చేయూత' పేరుతో జరిగిన హంగామాపై వారు నిట్టూర్చుతున్నారు. వీటికి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి 23న ముఖ్యమంత్రి జగన్ ఆసరా బటన్ నొక్కారు. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఫిబ్రవరి మొదటివారంలో ఇక్కడ సభ పెట్టి హడావిడి చేశారు. ఈ రోజు వరకూ డబ్బులు పడలేదు. తాజాగా సోమవారం రాజన్నదొర పోరాం గ్రామంలో చేయూత సభపెట్టారు. అధికారులు ఆర్భాటంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. భోజనాలు వద్ద కుమ్ములాట జరిగింది. తోపులాటలో కొందరికి భోజనాలు లేవు. ఆకలితో వెనుతిరిగారు. కాగా, సభలో రాజన్నదొర మాట్లాడుతూ ఆ ముగ్గురినీ నమ్మవద్దంటూ మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఉన్న ఫొటోను వేదికపై ప్రదర్శించారు. అటూఇటూ కలియతిరుగుతూ అందరికీ చూపారు. కానీ జనం నుంచి స్పందన లేకపోయింది.

బాల్య వివాహాలు నేరం

రాజాం: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు జరగకుండా మహిళా సంఘాల సభ్యుల అడ్డుకోవాలని ఎంపీడీవో బాసూరు శంకరరావు సూచించారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏడాదికి లక్ష ఆదాయం దాటిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష రూపాయలు ఆదాయం దాటిన బొత్స హిందుమతి, బంగారు కృష్ణవేణి, కొన్న సరోజిని, లాభాన అనూరాధ, బంగారు పద్మ, వర్రి శాంతి తదితరులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బండి నర్సింహులు, లావేటి రాజగోపాలనాయుడు, ఏపీఎం అప్పలనాయుడు, ఈపీఎఫ్ ఏపీఎం హేమలత, ఐసీడీఎస్ సూపరువైజరు జానకి పాల్గొన్నారు.

● **వంగర:** బాల్యవివాహాలు అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీపీ సురేష్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఎంఈవో-2 దుర్గారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పేకాట రాయుళ్ల అరెస్టు

భోగాపురం: భోగాపురం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీ సమీప మామిడి తోటలో పేకాట శిబిరంపై దాడి చేసి, ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని సీఐ ఎ.రవికుమార్ సోమవారం తెలిపారు. పేకాట నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసి, వారి నుంచి రూ.3,100 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

మద్యం స్వాధీనం

భోగాపురం: తూడెం గ్రామంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన దువ్వు రాంబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని సీఐ ఎ.రవికుమార్ సోమవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

క్రాష్ ప్రోగ్రాం ప్రారంభం

చీపురుపల్లి: వేసవి కాలంలో నిర్వహించే క్రాష్ ప్రోగ్రాంను ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్వేత, ఏవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలవలసలో హాకీ పోటీలు

గుర్ల: పాలవలస గ్రామంలో జిల్లా స్థాయి హాకీ పోటీలను వైసీపీ నాయకుడు పి.సన్యాసినాయుడు సోమవారం ప్రారంభించారు. మొదటిరోజు పాలవలస, శ్రీకాకుళం, విజయనగరం జట్లు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు బండారు బంగారురాజు పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల ధర్నా

గరివిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఈపీఎఫ్ మండల సంఘం ఆధ్వర్యంలో పెన్షన్‌దారులు ధర్నా నిర్వహించారు. కనీసం 7500 ప్లస్ డీఏ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు ఎ.గౌరినాయుడు, జె.విశ్వనాథరాజు, తాళ్లపూడి సత్యం, సలీం, ఓఎస్ఎన్ మూర్తి, గంట అప్పలరాజు, కరణం సన్యాసినాయుడు, శనపతి పాపినాయుడు, శనపతి రమణ పాల్గొన్నారు. అనంతరం డీటీకి వినతిపత్రం అందించారు.



ధర్నా చేస్తున్న పెన్షనర్లు

అక్రమ తొలగింపులు ఆపకపోతే పోరాటమే

జామి: అన్నంరాజుపేట పంచాయతీ సీతానగరం పాఠశాలలో 20 ఏళ్లుగా ఎండీఎం కార్మికురాలిగా పనిచేస్తున్న లక్ష్మిని తొలగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఆపాలని, ఆమెపై వేధింపులు మానుకోవాలని లేదంటే సీఐటీయూ పోరాటం చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. సోమవారం మండల విద్యాశాఖాధికారిణి జయశ్రీని కలిసి వినతిపత్రం అందించారు. లక్ష్మిపై ఇటీవల విధుల్లో చేరిన ఎండీఎం కార్మికురాలి భర్త, బంధువులు దాడి చేసి, ఆమెను విధుల్లో చేరకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. వారిపై చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలో ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గాడి అప్పారావు, ఎం.హర్ష తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారు

శృంగవరపుకోట: మహిళలు తమ శక్తిని అన్ని రంగాల్లో చాటి చెబుతు న్నారని విశాఖ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. సోమవారం శృంగవరపుకోట శిరికి కన్వెన్షన్ హాల్లో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మహిళ ప్రజా ప్రతినిధులు శోభా హైమావతి, శోభా స్వాతిరాణి తదితరులున్నారు.

అంబాడలో గాంధీ విగ్రహావిష్కరణ

రేగిడి: మండలంలో అంబాడ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన గాంధీ విగ్రహాన్ని సోమవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో విగ్రహదాత రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్, ఎంఈవో వరప్రసాదరావు, సర్పంచ్ చుక్క వెంకటనాయుడు, రాజాం రెడ్‌క్రాస్ కన్వీనర్ పెంకి చైతన్యకుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్, హెచ్ఎం సత్యంనాయుడు, గేదెల గోపాలం, విద్యా కమిటీ చైర్మన్ మజ్జి గంగ, తిరుమళేశ్వరరావు పాల్గొన్నారు.


స్వామివారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

సంగాం జాతరకు పోటెత్తిన భక్తజనం

వంగర: సంగాంలోని సంగమేశ్వరస్వామి ఆలయం సన్నిధిలో శివ రాత్రి పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతరకు నాలుగో రోజూ సోమవారం భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమం వద్ద స్నానాలకు పెద్దఎత్తున తరలివచ్చారు. శివుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం స్వామివారిని పల్లకి ఊరేగించారు. రాజాం సీఐ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో ఎస్ఐ జనార్దనరావు పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వందశాతం రికవరీ చేయాలి

రామభద్రపురం: మార్చిలోగా వందశాతం రికవరీ చేయాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ డి.రవికుమార్ కోరారు. మండల వెలుగు కార్యాలయంలో సోమవారం వీవోఏలు, వెలుగు సిబ్బందితో సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ రికవరీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డ్వాక్రా సంఘాలు ఏ గ్రేడులో ఉండే విధంగా కృషి చేయాలని, తీర్మానాలు, బుక్ అప్‌గ్రేడ్‌లు కూడా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రత్న కుమార్, సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.